ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

● మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు

నల్లగొండ: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం నల్లగొండ ఆర్డీఓ కార్యాలయంలో మంత్రి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటడం తప్పనిసరి అని సూచించారు. భవిష్యత్ తరాలు కాలుష్యం బారిన పడకుండా ఉండేందుకు చెట్లే ఆధారమన్నారు. వన మహోత్సవం కింద జిల్లాకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా శాఖలు వాటికి కేటాయించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. వర్షాకాలం పూర్తయ్యేలోపే మొక్కలు నాటడం పూర్తిచేయాలని, ఇందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అనంతరం నల్లగొండ మండలం వెలుగుపల్లి గ్రామానికి చెందిన రిషికేశ్ పిడుగుపాటుకు గురై మరణించగా వారి కుటుంబ సభ్యులకు సీఎం సహాయ నిధి కింద రూ.2 లక్షల చెక్కును కలెక్టర్ కార్యాలయంలో మంత్రి అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్ చంద్ర పవార్, నల్లగొండ ఆర్డీఓ వై.అశోక్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అన్ని సౌకర్యాలు కల్పిస్తాం

నల్లగొండ టౌన్: నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లోని మొత్తం విభాగాల్లో వైద్య పరికరాలు, అన్ని సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. డయాలసిస్ కేంద్రానికి వచ్చిన నూతన వైద్య పరికరాలను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ చాంబర్‌లో వైద్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో భాగంగా ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేస్తామన్నారు. బ్లడ్ బ్యాంక్‌కు అవసరమైన రిఫ్రిజిరేటర్ ఇతర సౌకర్యాలకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే బ్లడ్ బ్యాంక్ ద్వారా ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. ప్రసవం తర్వాత బాలింతలకు ఎంసీహెచ్ కిట్లు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఆస్పత్రికి అవసరమైన సహాయాన్ని అందజేస్తామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వేణుగోపాల్‌రెడ్డి, వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనానికి భూమిపూజ చేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. రూ.20వేల కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఎంజీయూలో రూ.100 కోట్ల వ్యయంతో భవనాలు నిర్మించామన్నారు. ఇటీవలే ముఖ్యమంత్రి ఎల్ఎల్ఎం, ఎం ఫార్మసీ, కోర్సులు, భవనాలు మంజూరు చేశారని తెలిపారు. 2026–27 సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయన్నారు. గత ప్రభుత్వం రూ.9 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టిందని, వాటిని త్వరలోనే చెల్లిస్తామన్నారు.



మొక్క నాటి నీళ్లు పోస్తున్న మంత్రి కోమటిరెడ్డి

మంత్రికి వినతి

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని పద్మావతి నగర్ కాలనీ పార్కు అభివృద్ధి చేయాలని కోరుతూ కాలనీవాసులు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని గురువారం కోరారు. పార్కులో కమ్యూనిటీ హాల్, చెట్లు, మోటార్, ప్రహరీ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్‌రెడ్డి, కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు నేతి రఘుపతి, కొండూరు ఆంజనేయులు, కమిటీ సభ్యులు వీరస్వామి, ప్రభాకర్, వరలక్ష్మి, పద్మావతి, పావని, లక్ష్మి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం

నార్కట్‌పల్లి : నియోజకవర్గంలో అర్హులైన ప్రతిఒక్కరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణవెల్లంల, ఔరవాణి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే వీరేశం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఔరవాణి, బ్రాహ్మణ వెల్లంల గ్రామాల్లో 2018లో గత ప్రభుత్వం మొదలుపెట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. వాటికి నిధులు కేటాయించి త్వరలో పూర్తి చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులకు ఇళ్లు అందిస్తోందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడతారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమేష్, మాజీ ఎంపీపీ పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, బండ సాగర్‌రెడ్డి, కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెల్లంల గోపాల్‌రెడ్డి, చిరుమర్తి ధర్మయ్య, బొడిగె నర్సింహ, స్వామి, నీరుడు అశోక్‌రెడ్డి, రాంరెడ్డి, నడిగోటి శేఖర్, నాగరాజు, జగాలు, నర్సింహ, సట్టు సత్తయ్య, దూదిమెట్ల సత్తయ్య, భారత్, శ్రీనివాస్‌రెడ్డి, పుల్లెంల అచ్చాలు, సత్తి తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులు

తిప్పర్తి : డిస్ట్రిబ్యూటరీ కాలువల ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరుతూ గురువారం తిప్పర్తి మండల కేంద్రంలో నార్కట్‌పల్లి–అద్దంకి రోడ్డుపై రైతులు రాస్తారోకో చేశారు. రైతుల రాస్తారోకోకు సీపీఎం, బీఆర్ఎస్ పార్టీలు మద్దతు ఇచ్చాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తండు సైదులుగౌడ్, పలువురు రైతులు మాట్లాడుతూ నాగార్జున సాగర్ నీరు పొంగి పొర్లుతుంటే తిప్పర్తి మండలంలోని కాలువలకు మాత్రం నీటిని విడుదల చేయడం లేదన్నారు. ఇప్పటికే బోర్లు పోయక భూగర్భ జలాలు అడుగంటి తూకాలు ముదిరిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలకు వెంటనే నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కందుల లక్ష్మయ్య, రామచంద్రు, మన్నెం భిక్షం, రైతులు దయాకర్‌రెడ్డి, రొట్టెల జానయ్య, లింగారెడ్డి, బైరగోని శ్రీనివాస్, గుండు రవి, దేవిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జాని, రాజీవ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చిట్యాల: విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న చిట్యాల జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎంపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర గురువారం చిట్యాలకు చేరుకుంది. సైకిల్ యాత్ర బృందానికి డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు పంది నరేష్ స్వాగతం పలికారు. సైకిల్ యాత్ర బృందం సభ్యులతో కలిసి చిట్యాల జెడ్పీహెచ్ఎస్‌ను వారు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎం మూడు రోజులుగా పాఠశాలకు హాజరు కావడం లేదని విద్యార్థులు వివరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. పాఠశాలకు మంజూరైన సుమారు ఏడు లక్షల రూపాయల నిధులను హెచ్‌ఎం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. జిల్లా అధికారులు విచారణ చేసి పాఠశాల నిధులు దుర్వినియోగం చేసిన హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు కుర్ర సైదానాయక్, కుంచం కావ్య, నకిరేకల్ డివిజన్ కార్యదర్శి ముస్కు రవీందర్, కోనె రమేష్, స్పందన, జగదీష్, జగన్, నవదీప్, వీరన్న, ప్రణీత్, ఇమాన్యూల్, రాకేష్, అనిల్, మణి, ప్రవీణ్, వినోద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అధికారుల విచారణ

చిట్యాల: మండలంలోని వెలిమినేడు పీఏసీఎస్ ద్వారా జరిగిన యూరియా అక్రమ రవాణపై గురువారం డీసీఓ పత్యానాయక్ విచారణ చేపట్టారు. అక్రమ రవాణలో భాగస్వాములయిన పీఏసీఎస్ సిబ్బందిపై విచారణ అనంతరం శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట నకిరేకల్ వ్యవసాయశాఖ ఏడీ జానిమీయా, ఏఓ గిరిబాబు ఉన్నారు.

జూదరుల అరెస్ట్

కనగల్: మండలంలోని జి.యడవల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై బుధవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఇద్దరు పట్టుబడగా మరో ఐదుగురు పరారయ్యారు. పట్టుబడిన వారి నుంచి రూ.20వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, మూడు బైకులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తెలిపారు.

తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

గట్టుప్పల్ : గట్టుప్పల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీని తిరిగి తమకే అప్పగించాలని కోరుతూ మహిళలు గురువారం తహసీల్దార్ రాములుకు వినతిపత్రం అందించారు. 18 ఏళ్ల నుంచి ఏజెన్సీ తామే నిర్వహించామని గాయత్రి, బుగ్గమ్మ, కళమ్మ, జ్యోతి, కృష్ణయ్య తహసీల్దార్‌కు వివరించారు. తమను పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు అకారణంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు.

గూనలు తొలగించాలని..

నాంపల్లి: మండల కేంద్రంలో నాలుగు వరుసల రోడ్డు నిర్మాణంలో భాగంగా రైతుల పొలాల్లోకి అక్రమంగా గూనలు వేస్తున్నారని, వాటిని వెంటనే తీసివేయాలని రైతులు కామిశెట్టి రమాదేవి, చంద్రకళ గురువారం తహసీల్దార్ దేవసింగ్‌కు వినతిపత్రం అందజేశారు. పాత కల్వర్టు ప్రదేశంలో గూనలు వేయకుండా కొత్త స్థలాల్లో గూనలు వేసి రైతుల పొలాల్లోకి వరదనీరు, మురుగు నీరు పోయే విధంగా కాంట్రాక్టర్, సంబంధిత అధికారులు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు.

సమగ్ర విచారణ చేయాలి

చిట్యాల: వెలిమినేడు పీఏసీఎస్ ద్వారా పక్కదారి పట్టిన యూరియా ఘటనపై సమగ్ర విచారణ జరిపి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని చిట్యాల మండలం వెలిమినేడు బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు అర్రూరి శ్రీశైలం డిమాండ్ చేశారు. గురువారం ఆయన వెలిమినేడులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో బొంతల రామకృష్ణారెడ్డి, దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాతి శ్రీనివాస్, పైళ్ల రఘుమారెడ్డి, దేవిరెడ్డి సందీప్‌రెడ్డి, విజయ్‌కుమార్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న కమిషనర్ మల్లేషం

చండూరు : వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు రాజీవ్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ మల్లేషం ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. వార్డు అధికారులు, పర్యావరణ ఇంజనీర్ అరవింద్, మెప్మా సిబ్బంది, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

ఇద్దరికి కుక్కకాటు

మునుగోడు: మండలంలోని జమస్థాన్‌పల్లి, మునుగోడు గ్రామాల్లో ఇద్దరిని కుక్కలు కాటు వేశాయి. జమస్థాన్‌పల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు సత్యనారాయణ గ్రామంలో నడుచుకుంటూ వెళ్తుండగా కుక్క కాటువేసింది. అదేవిధంగా మునుగోడుకు చెందిన జయమ్మను వారు సాకుతున్న కుక్క కాటువేసింది. ఇరువురు మునుగోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందారు.

బిల్లుల మంజూరుకు కృషి



మాట్లాడుతున్న మురళి

నల్లగొండ: డైట్ బడ్జెట్ బిల్లులు త్వరగా మంజూరు అయ్యేందుకు కృషి చేస్తామని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి అన్నారు. గురువారం నల్లగొండలోని టీఎన్జీవోస్ భవనంలో నిర్వహించిన తెలంగాణ వసతిగృహ సంక్షేమ అధికారుల సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన వసతి గృహ సంక్షేమ అధికారులందరూ సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. రెవెన్యూ డివిజన్ల వారిగా కమిటీలు ఏర్పాటు చేసుకుని వసతి గృహ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. వసతిగృహ సంక్షేమ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రణదివే, కార్యదర్శి ఎ.సత్యనారాయణ, ఉపాధ్యక్షురాలు రమ్య సుధ, ట్రెజరర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

నూతన ఎక్సైజ్ పాలసీ నిలిపివేయాలి



నాంపల్లి: వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చండూరు : రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలనుకుంటున్న నూతన ఎక్సైజ్ పాలసీని విరమించుకోవాలని బీజేపీ చండూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు పందుల సత్యంగౌడ్ గురువారం చండూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బెల్లంకొండ స్వాతికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సత్యంగౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం 26200 మద్యం దుకాణాలకు టెండర్లలో పోటీని పెంచి లక్షా 25వేల టెండర్లు వేయించి రూ.2500 కోట్లు ఆదాయం వచ్చినట్లు ప్రకటించి టెండర్ల ద్వారా మధ్యతరగతి వారిని దోచుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మద్యాన్ని మూడింతలు చేస్తోందని, తెలంగాణ ఎక్సైజ్ పాలసీలో మార్పులంటూ ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ఎక్సైజ్ ఆదాయంపై ఆధారపడి పథకాలు అమలు చేస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు కోమటి వీరేశం, బూతరాజు శ్రీహరి, అన్నెపర్తి యాదగిరి, బోడ ఆంజనేయులు, సామ వెంకట్‌రెడ్డి, శంకర్, చంద్రమౌళి, శేఖర్, సాగర్,రాజు తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి: నూతన ఎక్సైజ్ పాలసీ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ గురువారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నాంపల్లి ఎక్సైజ్ ఆఫీస్ లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు దాచేపల్లి నర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వం నూతన ఎక్సైజ్ విధానం ద్వారా గ్రామానికో మద్యం దుకాణం ఏర్పాటు యోచన విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో చిరుమామిళ్ల గిరిబాబు, ప్రధాన కార్యదర్శి పాలగోని శ్రీకాంత్, నాంపల్లి శంకర్, నాంపల్లి శివ, పాలగోని నాగరాజు, యాదగిరి రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

తిప్పర్తి : ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కాలం నారాయణరెడ్డి అన్నారు. గురువారం తిప్పర్తి మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు చిట్టిప్రోలు సదానందం పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు నామిరెడ్డి మహేందర్‌రెడ్డి, ఎంఈఓ నర్సింహనాయక్, అరుంధతి, కత్తుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం నిర్ణయించాలి

రామగిరి (నల్లగొండ): ఆశా కార్యకర్తలకు కనీస వేతనాలు నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, నల్లగొండ మండల కన్వీనర్ పోలె సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండ మండలంలోని రాములబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశా కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఆశా కార్యకర్తలు కనీస వేతనాలు లేక కుటుంబాలు నడపలేని పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 3న నల్లగొండలో జరిగే జిల్లాస్థాయి ఆశా కార్యకర్తల సమావేశానికి అధిక సంఖ్యలో ఆశాలు రావాలని పిలుపునిచ్చారు. అవుట రవీందర్, అద్దంకి నరసింహ, భారతి , మంగమ్మ, సంతోష, తేజేశ్వరి, సైదమ్మ, చైతన్య, శోభారాణి, కవిత, జ్యోతి, పారిజాత, పుష్పలత పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్ ఏర్పాటు

మర్రిగూడ : మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం ఉపాధ్యాయులు కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ బిట్టు శ్రీను, ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మంచి పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో పాఠశాలలో కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజులత, వెంకట్‌కుమార్‌నాయక్, కొండ శ్రీనివాస్, మీనా, విద్యార్థులు పాల్గొన్నారు.



కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేస్తున్న ఉపాధ్యాయులు

ఎస్‌ఐ, సీఐలను సస్పెండ్ చేయాలని వినతి



ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్: బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు రావెళ్ల కాశమ్మ కుమారుడు నరసింహ ఆత్మహత్య కేసులో నల్లగొండ వన్‌టౌన్ ఎస్‌ఐ, సీఐని సస్పెండ్ చేయాలని కోరుతూ గురువారం బీజేపీ నాయకులు ఎస్పీ శరత్ చంద్ర పవార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఐ వేధించడంతోనే నరసింహ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. మృతుడి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, తగిన పరిహారం అందజేసి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పకీరు మోహన్ రెడ్డి, గడ్డం మహేష్, వెంకటేశ్వర్లు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణపై ఫలించిన పోరాటం



పౌరసరఫరాల శాఖ డీటీ రఘునందన్

నల్లగొండ: పొగాకు నియంత్రణ కోసం 22 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేస్తున్న పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్‌ను రాష్ట్రపతి భవన్ గుర్తించింది. రఘునందన్ సూచనను పరిగణలోకి తీసుకుని స్కూళ్లు కాలేజీల వద్ద పొగాకు ఉత్పత్తుల విక్రయాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖను, పొగాకు నియంత్రణ విభాగాన్ని రాష్ట్రపతి భవన్ ఆదేశించడమే గాక నేషనల్ టుబాకో కంట్రోల్ బోర్డ్ తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాసింది. వివరాలు.. పొగాకు నియంత్రణ కోసం రఘునందర్ పలుమార్లు ప్రజాప్రతినిధులకు ఉన్నతాధికారులకు లేఖలు రాశారు. ఆయన పోరాటాన్ని గుర్తించి జూలై 16 న రాష్ట్రపతి భవన్‌కు రావాలని ఆహ్వానం అందింది. రాష్ట్రపతి భవన్‌కు చేరుకున్న రఘునందన్‌కు అనివార్య కారణాల వల్ల రాష్ట్రపతిని కలిసే అవకాశం కలగలేదు. కాగా రాష్ట్రపతి భవన్ అధికారులు రఘునందన్ నుంచి 42 పేజీల నివేదికతోపాటు రాష్ట్రపతికి రాసిన లేఖను స్వీకరించారు. అనంతరం రాష్ట్రపతి భవన్ నుంచి పొగాకు నియంత్రణ బోర్డుకు, ఆరోగ్య శాఖకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమాచారాన్ని రఘునందన్‌కు అధికారులు ఈ మెయిల్ ద్వారా తెలిపారు.

రఘునందన్‌కు అవార్డు

మర్రిగూడ : పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్‌కు సైఫర్ టొబాకో కంట్రోల్ అవార్డుకు నామినేట్ చేసినట్లు ఛండీగఢ్‌కు చెందిన ప్రజారోగ్య, అధ్యయన పరిశోధన సంస్థ స్ట్రాటజిక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పబ్లిక్ హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (సైఫర్) వెల్లడించింది. ఈ మేరకు గురువారం ఆచార్య సోనూ గోయల్ తనకు సమాచారం అందించారని రఘునందన్ తెలిపారు. 22 ఏళ్లుగా పొగాకు నియంత్రణకు కృషి చేస్తున్న తనను టొబాకో కంట్రోల్ హీరో అవార్డుకు ఎంపిక చేయడం ఆనందంగా ఉందన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ కేడెట్ల శిక్షణ శిబిరం



శిక్షణ ముగించుకున్న ఎంజీయూ ఎన్‌సీసీ కేడెట్లు

నల్లగొండ టూటౌన్: ఎంజీయూకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు పది రోజులుగా సికింద్రాబాద్‌లోని పోలీస్ శిక్షణ కేంద్రంలో పొందుతున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి కల్నల్ లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్‌సీసీ కేడెట్లు క్రమశిక్షణ, ఆచరణాత్మక దేశ భక్తికి ఉదాహరణ అన్నారు. యూనివర్సిటీ నుంచి 10 మంది యువకులు, 10 మంది యువతులు శిక్షణకు హాజరైనట్లు ఎంజీయూ ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ మచ్చేందర్ తెలిపారు. శిక్షణ ముగించుకుని వచ్చిన ఎన్‌సీసీ కేడెట్లను ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, రిజిస్ట్రార్ అల్వాల రవి, ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్.సుధారాణి అభినందించారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కనగల్: హైదరాబాదులో ఈ నెల 3న వైశ్య వికాస వేదిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే వైశ్య రాజకీయ రణభేరి సభ వాల్ పోస్టర్‌ను ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ అధ్యక్షుడు కొత్తమాస్ ప్రభాకర్ గురువారం కనగల్‌లో ఆవిష్కరించారు. ఈ సదర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాలో నిర్వహించే రాజకీయ రణభేరి సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఉప్పల మారయ్య గుప్తా, బూరుగు వెంకటేశ్వర్లు, ఉపేందర్, పందిరి వెంకటేశ్వర్లు, శ్రీధర్, ఓరుగంటి ఈశ్వరయ్య, శంకరయ్య, మిరియాల నరేందర్, గార్లపాటి శ్రీనివాస్, ఇ.వెంకటేశ్వర్లు, సిద్దంసెట్టి రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

కనగల్: కనగల్ క్రాస్ రోడ్డులోని భూనీల సమేత శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం భూనీల సమేత శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వార్ల తిరు కల్యాణ మహోత్సవం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆలయ శాశ్వత ధర్మకర్త బుసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి-రమ దంపతులు తలంబ్రాలు పట్టు వస్త్రాలను అందజేశారు. భక్తులు స్వామి అమ్మవార్లకు ఒడి బియ్యం కట్న కానుకలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేడుకల్లో ఆలయ చైర్మన్ చిట్ల లింగయ్యగౌడ్, సింగిల్ విండో చైర్మన్ వంగాల సహదేవరెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింగ్ సునీత కృష్ణయ్య గౌడ్, ఓరుగంటి ఈశ్వరయ్య, శంకరయ్య, పాలకూరి పెద్దులు, నర్సింగ్ లక్ష్మయ్య గౌడ్, వంగాల యాదవ రెడ్డి, నీలకంఠం శంకర్, ఒట్టే శంకర్, నీలకంఠం వెంకన్న, ఒట్టి గణేశ్‌లు పాల్గొన్నారు.

నిరుపయోగంగా చెత్త సేకరణ రిక్షాలు



కొర్లపహాడ్‌లో వృథాగా ఉన్న చెత్త సేకరణ రిక్షాలు

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ గ్రామ పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన చెత్త సేకరణ రిక్షాలు నిరుపయోగంగా మారాయి. చెత్త సేకరణకు ట్రాక్టర్లు వినియోగంలోకి రావడంతో రిక్షాలు మూలకుపడ్డాయి. రిక్షాలు నడిపించకుంటే వాటిని గ్రామ పంచాయతీ కార్యాలయంలో భద్రపరచాలి. లేదంటే వాటిని విక్రయించి వచ్చిన సొమ్మును గ్రామ పంచాయతీ నిధుల్లో జమ చేయాలి. కానీ స్థానిక ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద ఆరు బయట పడేసి అధికారులు చేతులు దులిపేసుకున్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

చండూరు : నీతి, నిజాయితీలతో కూడిన సమాజ నిర్మాణం కావాలంటే ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల గద్దర్ అన్నారు. గురువారం చండూరు జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన ప్రధానోపాధ్యాయుడు ఎడ్ల భిక్షం పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కవి రచయిత అంబటి వెంకన్న, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మమత, ఎంఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగి కుటుంబానికి సహాయం

చండూరు : ఇటీవల గుండెపోటుతో మరణించిన పోచంపల్లి కో ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగి తిరందాసు శివప్రసాద్ కుటుంబానికి బ్యాంకు యాజమాన్యం, సిబ్బంది కలిసి రూ.1,25,500 ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాన్ని అందజేశారు. అనంతరం బ్యాంకు చైర్మన్ తడక రమేష్, వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఖాతాదారులను కోరారు. గుర్తు తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు తెలియజేయకూడని అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ సీత శ్రీనివాస్, మేనేజర్లు రాజు, స్వామి, ఉభయ ఆలయాల చైర్మన్ రావిరాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.



ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రం అందజేస్తున్న చైర్మన్ రమేష్